క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

చీరాల టౌన్: గ్రామంలో సీజనల్ వ్యాధులకు గురికాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని, ప్రజలంతా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని దేవాంగపురి గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్రీను సూచించారు. బుధవారం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గుమస్తాల కాలనీ, కృపానగర్, హస్తినాపురం, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక సెక్రటరీ మాట్లాడారు. జనావాసాల మధ్య చెత్త కుప్పలను నిల్వ చేయకూడదన్నారు. పరిసరాల శుభ్రతకు ప్రజలంతా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

సంఘాల అభివృద్ధి సాధ్యం

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని వెలుగు ఏపీఎం కె.మధుసూదన్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో ఏపీఎం సమావేశాన్ని నిర్వహించారు. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా పొదుపు సంఘాల వీవోఏలు చర్యలు చేపట్టాలన్నారు. మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూళ్లు చేయాలన్నారు. ఉన్నతి పథకంలో తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకునివృద్ధి చెందాలన్నారు. ప్రతి గ్రూపు తీసుకున్న రుణాలను కేవలం స్వయం సహకారం పెంపొందించుకునే సంస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

విభిన్న ప్రతిభావంతునికి మూడు చక్రాలబండి

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం ఏరువాక సందర్భంగా హరహర క్షేత్రంలోని గోశాలకు తౌడు బస్తాలను అందజేశారు. అదే విధంగా కొంగపాడు గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు మంగారావుకు, జాగర్లమూడి శివకుబమారి సౌజన్యంతో మూడు చక్రాల బండిని అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సభ్యులు పాల్గొన్నారు.

16న స్టూడెంట్ బస్ పాస్‌ల జారీ

చీరాల అర్బన్: పాఠశాలలు పునఃప్రారంభవుతున్న తరుణంలో ఈనెల 16 నుంచి కొత్త బస్ పాసులు అందించనున్నట్లు డిపో మేనేజర్ జె.శ్యామల బుధవారం తెలిపారు. గురువారం, శుక్రవారం బస్‌పాసుల సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అవుతుందని, 16 నుంచి బస్‌పాసులు ఆర్టీసీ బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్‌లో అందించనున్నట్లు తెలిపారు.

నేడు మోగనున్న బడి గంట

చీరాల అర్బన్: పాఠశాల గంట నేటి నుంచి మళ్లీ మోగనుంది. వేసవి సెలవుల అనంతరం గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తిరిగి పునఃప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా పాఠశాలలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. రెండు పూటలా పాఠశాలలు పనిచేయనున్నాయి. చీరాల మండలంలో మొత్తం 152 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభం రోజునే విద్యార్థులకు యూనిఫాం, టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్ అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పుస్తకాలు ఆయా పాఠశాలలకు చేరుకున్నాయి. ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు జరగగా ఉపాధ్యాయులు బదిలీ అయిన పాఠశాలల్లో విధుల్లోకి చేరారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం కాకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల్లో విధుల్లో కొనసాగుతారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా హాజరుకానున్నారు.

అన్నదాతకు నిరాశ

- అమాంతం పెరిగిన సాగు ఖర్చులు
- ఏటేటా భారం.. మారుతున్న విత్తనాలు, కూలీలు, ఎరువుల ధరలు
- ప్రభుత్వం నుంచి అందని సాయం
- జిల్లాలో 1,84,882 హెక్టార్లలో సాగు భూమి



సాగుకు సిద్ధం చేస్తున్న భూమి

అద్దంకి: రైతన్నల కష్టం బూడిదలో పోసినట్లు అవుతోంది. గతేడాది అతివృష్టి, అనావృష్టితో రైతులు లబోదిబోమన్నారు. ఏదోలాగా పంటలను కాపాడుకున్నా ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇవ్వకపోవడంతో దళారులకు విక్రయించి పెట్టుబడి కూడా రాక అప్పుల పాలవుతున్నారు. అన్నదాత సుఖీభవ, ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీపై యంత్రాలు కూడా రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎవరూ పట్టించుకోరు

వరుస నష్టాలతో సతమతం అవుతున్న రైతులకు ఖరీఫ్‌లోనూ సాగు చేస్తే కష్టాలు తప్పేలా లేవు. ప్రభుత్వం నుంచి అందే పెట్టుబడి సాయం అటుంచితే గిట్టుబాటు ధరకు కూడా కొనుగోలు చేసేవారు కానరావడంలేదు. మొక్కజొన్న, పత్తి, పొగాకు, తదితర పంటలను సాగు చేసే అవకాశం ఉంది. కనీసం విత్తనాలను రాయితీపై అందిస్తే సాగుకు ఊతం ఇచ్చినట్లు అవుతుందని రైతులు కోరుతున్నారు.

నైరుతీ రుతుపవనాల రాకతో సాగుకు సమాయత్తం

వ్యవసాయం భారంగా మారినా, సొంత భూములను బీడు పెట్టుకోవడానికి ఇష్టపడని రైతులు మరలా ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఈ సంవత్సరం ముందుగానే వర్షాలు పడటం, ఇక మీదట కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతుండడంతో ఏరు వాక బాట పట్టారు.

గత ప్రభుత్వం హయాంలో పండుగలా..

గత ప్రభుత్వ హయాంలో సాగు పండగలా సాగింది. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరకు అధికారులు పంట ఉత్పత్తులను కొనుగోలు చేశారు. నేడు ఆ పరిస్థితి లేదు. జిల్లాలో సుమారు 4 లక్షల మంది రైతులున్నారు. ఖరీఫ్‌లో 2.5లక్షలకు పైగా భూముల్లో కంది, మిరప, మినుము, మొక్కజొన్న, పసుపు, ఉల్లి, తదితర పంటలను వేయడానికి దుక్కులు దున్ని సిద్ధం చేశారు. వీరందరికీ నాటి ప్రభుత్వం అండగా నిలిచి అదునులో గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీపై విత్తనాలు అందించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఇన్‌పుట్ సబ్సిడీ పెట్టుబడి సాయం అందించడంతో రైతులకు వ్యవసాయం పండుగలా సాగింది. దానికి తోడు గ్రామంలోని సచివాలయంలోనే పైసా ఖర్చు లేకుండా బీమా అందించారు. నేడు కూటమి ప్రభుత్వంలో అన్నదాతకు అండ లేకుండా పోయింది.

సాగు పెను భారమే



ఏటికేడు సాగు పెనుభారంగా మారింది. ఎరువులు, పురుగు మందులు, కూలీ ధరలు పెరిగిపోయాయి. ప్రభుత్వం నుంచి పైసా సాయం అందడం లేదు. ఆరుగాలం వ్యవసాయం చేసి పండించిన పంటలకు గిట్టుబాటు ధర ప్రకటనలకే పరిమితం అయింది. ఆ ధరకు కొనుగోలు చేసే వారే లేదు. ప్రభుత్వ కేంద్రాల్లోనూ ధాన్యం కొనలేదు.

– బ్రహ్మారెడ్డి, రైతు, కొరిశపాడు

దళారుల రాజ్యం అయింది



పంటలు వేసిన దగ్గర నుంచి అతివృష్టి అనావృష్టి, తప్పించుకుని పండించిన పంటకు గిట్టుబబాటు ధర లేదు. కేంద్రాలు ఏర్పాటు చేసినా శాంపిల్స్ తీసుకుని వెళ్లి మరలా కొనుగోలుకు రాలేదు. పేరుకే గిట్టుబాటు ధరగా మారింది. పండించిన పంటను నిలబెట్టుకోలేని పరిస్థితుల్లో దళారులు అడిగినకాడికి అమ్ముకున్నాం.

– భూసా వెంకటేశ్వర్లు, భూసావారిపాలెం

బీమా పథకాలకు నమోదు చేసుకోండి



బీమా చెక్కు అందజేస్తున్న మేనేజర్

బల్లికురవ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలకు బ్యాంకు ఖతాదారులు నమోదుతో ప్రీమియం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వ్యాంకు కొప్పరపాడు శాఖ మేనేజర్ ఎం. వాసు కోరారు. కూకట్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వేల్పుల ఏసోబు ఇటీవల మృతిచెందాడు. బుధవారం ఆయన భార్య వెంకట రమణకు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజనలో రెండు లక్షల చెక్కును అందజేశారు. పీఎం, జేజేబీఎం, పీఎంఎస్‌బీవై బీమా పథకాల్లో ఖాతదారులంతా నమోదు చేసుకోవాలని అకాల మరణం చెందినా ప్రమాదం సంభవించినా బీమా వర్తిస్తుందని మేనేజర్ వివరంచారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు



మాట్లాడుతున్న ఏఓ సుబ్బారెడ్డి

జె.పంగులూరు: ప్రతి రైతు తన పొలాలను భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చందలూరు, తూర్పు కొప్పెరపాడు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఏఓ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్షలు నిర్వహించి, వాటి ఫలితాల మేరకే పంటలకు ఎరువులు, పురుగు మందులు వినియోగించాలన్నారు. రైతులు పచ్చిరొట్ట పంటలు సాగు చేపట్టి, భూసారాన్ని మరింత పెంచుకోవాలన్నారు. భూమిని కౌలుకు తీసుకున్న రైతుల సాగుదారు హక్కు పత్రాలు పొందడం ద్వారా ప్రభుత్వం అందజేసే అనేక సదుపాయాలను పొందగలుగుతారన్నారు. ఆధార్, పొలం పాస్‌పుస్తకం తీసుకొవచ్చి మీ పేర్లు పరిశీలించుకొని ఈకేవైసీ చేయవలసిందిగా తెలిపారు. కార్యదర్శులు, వ్యవసాయ శాఖ సహాయకలు పాల్గొన్నారు.

ఉపాధి పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం

జె.పంగులూరు: ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే రాయితీలను ఉపయోగించుకొని పండ్ల తోటలు పెంచాలని డ్వామా పీడీ విజయలక్ష్మి అన్నారు. బుధవారం ముప్పవరంలో మామిడి తోటలను పరిశీలించారు. ముప్పవరంలో గ్రీన్ పార్క్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. రూ.1.40 లక్షల వ్యయంతో గ్రామంలో గ్రీన్ పార్క్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్సై వినోద్‌బాబు, చీరాల ఏపీడీ సువార్త, ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్, ఏపీఓ సంతోషం, నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

మార్టూరు: మనస్తాపంతో యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని లక్కవరం గ్రామంలో బుధవారం వెలుగు చూసింది. వయ ద్దనపూడి మండలం యద్దనపూడి గ్రామానికి చెందిన కావల ప్రియాంక (27) కుటుంబ సమస్యల నేపథ్యంలో ఇటీవల మార్టూరు మండలం లక్కవరం గ్రామంలోని తమ బంధువుల ఇంటి ఉంటోంది. ఈ క్రమంలో గత సోమవారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ప్రియాంకను మొదట చిలకలూరిపేట అనంతరం గుంటూరు ఆసుపత్రులకు చికిత్స నిమిత్తం తరలించగా బుధవారం మృతి చెందింది. మార్టూరు ఎస్సై షేక్ సైదా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రానైట్ కార్మికుడి మృతిపై కేసు నమోదు

మార్టూరు: గ్రానైట్ పరిశ్రమలో ము డి రాయి కిందపడి కార్మికుడు మృతి చెందిన విషయమై కేసు నమోదు చేసినట్లు బుధవారం రాత్రి పోలీస్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎస్ఐ మహబూబ్ బాషా వివరాలు ఇ లా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నీరజ్ (19) గత కొంతకాలంగా స్థానిక నాగరాజు పల్లి రోడ్డు లో గల శాంతి గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గత మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో గ్రానైట్ ముడి రాయి నీరజ్ పై పడటంతో బాధితుడిని హుటాహుటిగా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అంగన్‌వాడీలకు యోగాపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పర్చూరు(చినగంజాం): నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యం పెరుగుతుందని మండల యోగా పర్యవేక్షకులు, ఉప్పుటూరు హోమియో వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ సుభద్ర ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు యోగాపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం పెంచేదే యోగానేనని అందరికీ యోగాపై అవగాహన పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గర్భిణులకు యోగ వలన సాధారణ ప్రసవం సాధ్యమవుతుందన్నారు. నూతలపాడు ఆయుర్వేద వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సూపర్ వైజర్‌లు అన్నపూర్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా జరగాలి



మాట్లాడుతున్న విజయలక్ష్మి

సంతమాగులూరు(అద్దంకి): మండలంలో చేస్తున్న సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి చెరుకూరి విజయలక్ష్మి అన్నారు. మండల కార్యదర్శులు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డిజిటల్ అసిస్టెంట్‌తో నిర్వహిస్తున్న సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలన్నారు. వలసలో ఉన్న వారికి వాట్సాప్ ద్వారా లింకు పంపి ఆధార్ ఓటీపీ ద్వారా స్వయంగా వారే ఈకేవైసీ చేసుకునే సదుపాయాన్ని అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని చెప్పారు. తల్లికి వందనం పథకం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను ఎంపీసీఐ మ్యాపింగ్ చేసే విధంగా చూడాలని చెప్పారు. రాష్ట్ర ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగా ఆంధ్రప్రదేశ్ లో భాగంగా ప్రతి సచివాలయంలో పెద్ద ఎత్తున ప్రజలకు నేర్పించాలని ఆదేశించారు.

సూర్య ఘర్‌తో తక్కువ బిల్లు



మాట్లాడుతున్న ఈఈ మాస్తాన్‌రావు

బల్లికురవ: ప్రధానమంత్రి సూర్యఘర్ యూనిట్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లుల భారం నుంచి ఉపశమనం పొందవచ్చని ఆ శాఖ ఈఈ ఎన్. మస్తానరావు అన్నారు. బుధవారం సూర్యఘర్ ఏర్పాటుపై పెద అంబడిపూడి గ్రామ సచివాలయం వద్ద వినియోగదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటి అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ. 60వేలు, మూడు కిలోవాట్లకు రూ. 78 వేలు రాయతీ అందజేస్తోందని ప్రతి ఒక్కరూ మూడు కిలోవాట్ల యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మూడు లక్షల రూపాయలు అవుతాయనిచెప్పారు. రాయితీ పోను బ్యాంకులు రుణంగా ఇస్తోందని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులంతా వినియోగించుకోవాని ఈఈ కోరారు. ఈసదస్సులో ఏఈ కె. శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం రాజారావు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

చీరాల రూరల్: క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, మందులువాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందని ఈపురుపాలెం డాక్టర్ శ్రీదేవి అన్నారు. 100 రోజుల ముక్తి భారత్ అభియాన్ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం బోయినవారిపాలెం, ఈపురుపాలెం-4 సచివాలయాల్లో చీరాల టీబీ యూనిట్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సిబ్బంది కె. శ్రీలక్ష్మి జె. బాలజి, సీహెచ్. రజని, పి. పార్వతి, జి. నాగమ్మ, ఎస్‌కె. షాహిద, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరులో జాబ్ మేళా రేపు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరు కొణిదెన రోడ్డులో గల వీరగంధం డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి. ప్రణయ్ బుధవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. డిగ్రీ చదివి 18 నుంచి 30 సంవత్సరమల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులు రెస్యూమ్, విద్యార్హతల జెరాక్స్, ఆధార్ లింక్ అయిన మొబైల్ నెంబర్తో హాజరు కావాలని కోరారు. వివరాలకు 9988853335 సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



అద్దంకి: వినాయకునికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఈదా శ్రీనివాసరెడ్డి, రైతులు



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దుక్కి దున్నుతున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

సంప్రదాయబద్ధంగా ఏరువాక



సూరేపల్లిలో గ్రామోత్సవం

అద్దంకి: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో బుధవారం ఏరువాకను సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. దానిలో భాగంగా అద్దంకి మండలంలోని మణికేశ్వరం గ్రామంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వరసిద్ధి వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కుడుములు వండి వినాయకునికి నైవేద్యం సమర్పించారు. పాడి పంట సమృద్ధిగా పండాలని, పంటలు సాగు చేసిన రైతుల ఇళ్ల ధాన్యంతో కళకళలాడాలని స్వామిని వేడుకున్నారు. ఈదా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఏరువాక రాను రాను కళ తప్పుతోందన్నారు. రైతుకు ఆదరణ లేకపోవడం, ఆదుకునే ప్రభుత్వాలు కరువవడంతో ఏరువాక కార్యక్రమం కూడా చూడలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సోమా శ్రీనివాస రెడ్డి, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఏరువాక వేడుకలు



పూజలు అందుకుంటున్న వరసిద్ధి వినాయకుడు

బల్లికురవ: వ్యవసాయ పనుల ఆరంభానికి సంబంధించి ఏరువాక పౌర్ణమి వేడుకలు బుధవారం మండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. సూరేపల్లి, నక్కబొక్కలపాడు, బల్లికురవ, వల్లాపల్లి, అంబడిపూడి, వేమవరం, కొప్పరపాలెం, కొణిదెన గ్రామాల్లో వ్యవసాయానికి ఉపయోగించే ఎడ్లను శుభ్రపరచి హారతులిచ్చిపూజలు చేశారు. సూరేపల్లిలోని లక్ష్మీ గణపతి ఆలయం, కొత్తపాలెంలోని కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సూరేపల్లిలో వేడుకల్లో భాగంగా లక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఉంద్రాళ్లు చేసి పొలంలో చల్లారు. ఆలయం వద్ద అన్నసంతర్పణ చేశారు.

రైతులు మంచి దిగుబడులు సాధించాలి

పర్చూరు(చినగంజాం): ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని సాగు మొదలు పెడుతున్న రైతులు మంచి దిగుబడులు సాధించాలని పర్చూరు తహసీల్దార్ బ్రహ్మయ్య ఆకాంక్షించారు. బుధవారం ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని ఆయన కార్యాలయ ఆవరణలో అరక దున్నే కార్యక్రమాన్ని ప్రారంభించి రైతులకు శుభాకంక్షలు తెలియజేశారు. రైతులు ఏరువాక పౌర్ణమి రోజున విత్తనాలు నాటి సాగు చేపట్టి తమ పంటల్లో మంచి దిగుబడి సాధించాలని ఆకాంక్షించారు. ఏరువాక రోజున ఎద్దులను, నాగలిని పూజించి తొలిసారిగా దుక్కి దున్నే పవిత్ర దినం అని తహసీల్దార్ అన్నారు. వర్ష రుతువు ఆరంభానికి సూచికగా ఈ పండుగను జరుపుకుంటారని వివరించారు.

రైతులకు ఏరువాక శుభాకాంక్షలు



గాదె మధుసూదనరెడ్డి

పర్చూరు(చినగంజాం): ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని పర్చూరు నియోజక వర్గంలోని రైతులకు, ప్రజలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదె మధుసూదనరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. జ్యేష్ఠ మాస శుద్ధ పౌర్ణమి నాడు జరుపుకునే ఏరువాక పౌర్ణమి రైతు జీవితానికి ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. పశు సంపదే దైవత్వం, పనిని పూజించడమే సంస్కృతి, ఎద్దులు, నాగలిని పూజించి తొలిసారిగా దుక్కి దున్నే పవిత్ర దినమే ఏరువాక పౌర్ణమి అని ఆయన అన్నారు. రోహిణి కార్తె ముగిసి మృగశిర కార్తె వస్తే రైతన్నలో కొత్త ఆశలు చిగురిస్తాయని, వర్ష రుతువు ఆరంభానికి సూచికగా ఈ పండుగను జరుపుకుంటున్నారన్నారు. యూరప్ దేశాల్లోనూ మేపాన్ అనే పేరుతో పంటల ప్రారంభ వేడుకలు జరుపుకుంటారని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేసిందని.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు పక్షపాతిగా ఖ్యాతి గడించారని గుర్తు చేశారు.